క్లుప్తంగా

శివాలయానికి రూ.లక్ష విరాళం



రేపల్లె: గంగడిపాలెం పంచాయతీలోని శివాలయంలో ఈ నెల 4 నుంచి నిర్వహించనున్న ఉత్సవాలకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు విరాళం అందజేశారు. శివాలయ నిర్వహణ కమిటీకి ఆదివారం ఆయన లక్ష రూపాయల అందజేశారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచులు టి.శివాజీ, తలశిల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఆసరా' సంబరాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం సాయంత్రం 4 గంటలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ముఖ్య తిథిగా పాల్గొని, నగదు చెక్కు లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. ఎంపీడీఓ జి.చంద్రశేఖర్, జెడ్పీటీసీ తిరు వీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్య శాస్త్రి, మల్లోలు ఉషారాణి పాల్గొంటారని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

భట్టిప్రోలు: పాఠశాల విద్యా కమిషన్ ఆదేశానుసారం సోమవారం నుంచి 30వ తేదీ వరకు గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు జరుగుతాయని ఎంఈఓ పులి లాజర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో కేంద్రాలుగా ఉన్న హైస్కూళ్లకు పరీక్ష జరిగే ఆరు రోజులు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలు లేని పాఠశాలలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాలలు జరుగుతాయని వెల్లడించారు. ఈ నెలలో రెండవ శనివారాన్ని పని దినంగా పరిగణించడం జరుగుతుందని పేర్కొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.


పరీక్షలకు సర్వం సిద్ధం

కొల్లిపర: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 503 మంది విద్యార్థుల్లో అత్తోట హైస్కూల్లో 118, కొల్లిపర హైస్కూల్లో 282, వల్లభాపురం హైస్కూల్లో 103 మంది పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. హాల్ టిక్కెట్, పెన్ను తప్పని సరిగా తెచ్చుకోవాలని సూచించారు.

అలరించిన వీణా నాదార్చన

పాత గుంటూరు: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్తంభాలగరువు శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం అభిషేకం, విశేష పూజలు జరిపారు. రాత్రి పుష్పాభిషేకం నిర్వహిస్తుండగా, శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపకులు, వీణాగాన ప్రపూర్ణ ఎ. భారతీదేవి శిష్య బృందం కె. నాగలక్ష్మి, భవాని, సాయిలక్ష్మి వీణా నాదార్చన చేశారు. మహా గణపతిం కీర్తనతో ప్రారంభించి మరుగేలరా ఓ రాఘవ, వినవయ్య రామా అంటూ అనేక కీర్తనల్ని వీనుల విందుగా పలికించారు. వీరికి మృదంగంపై జగన్మోహిని చక్కని వాయిద్య సహకారాన్ని అందించారు.

తెనాలి ప్రయాణికులకు బంపర్ ఆఫర్



తెనాలిఅర్బన్: తెనాలి డిపో నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లే ఇంద్ర బస్సుల్లో పది శాతం చార్జీ రాయితీ ఇస్తున్నట్లు తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు రాయితీ కొనసాగుతుందన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం నుంచి ఇంద్ర బస్సులో తెనాలి వచ్చినా.. ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'వైఎస్సార్ ఆసరా'



ఆసరా నగదు చెక్కును అందజేస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

- 2024లోనూ వైఎస్సార్ సీపీ అఖండ విజయం
- మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నగరం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం కింద విడతల వారీగా డ్వాక్రా పొదుపు సంఘాలకు రుణ మాఫీ సాయాన్ని అందిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. మూడో విడత రుణ మాఫీ సాయం రేపల్లె నియోజకవర్గానికి రూ.49 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అందులో నగరం మండలానికి రూ.7.99 కోట్లు వచ్చినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ వ్యవస్థతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా.. ఎటువంటి అవినీతికి తావు లేకుండా.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని మోపిదేవి గుర్తుచేశారు.

ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు నమ్మొద్దు..

రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఎంపీ మోపిదేవి విమర్శించారు. రాజకీయ అవగాహన లేకుండా లోకేష్ అర్థ రహితంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నగరం మండలానికి ఇప్పటి వరకు రూ.107 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఇంత అభివృద్ధి జరుగుతున్నా.. చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కల్యాణ్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎల్లో మీడియా ద్వారా అసత్యాలను ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. ప్రతిపక్షాలకు ఒంటరిగా పోటీ చేసే దమ్ములేదని.. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ సింగల్ గానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. 2024లోనూ వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధిస్తుందని, మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద 1,044 డ్వాక్రా గ్రూపుల్లోని 10,269 మంది సభ్యులకు రూ.7.99 కోట్ల చెక్కును అందజేశారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జెడ్పీటీసీ మాన్యం నాగమణి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాధారమణ, ఏరియా కో–ఆర్డినేటర్ జి.రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'సంక్షేమం'తో మహిళల ఆర్థికాభివృద్ధి



అమర్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నగదు చెక్కు అందజేసిన మంత్రి మేరుగ

- మంత్రి మేరుగ నాగార్జున
- పొదుపు సంఘాల మహిళలకు రుణ సాయం పంపిణీ

అమర్తలూరు(వేమూరు): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డ్వాక్రా గ్రూపు సభ్యులకు రుణాలు రద్దు చేస్తామని చెప్పి, మాట తప్పడంతో.. మహిళలందరూ రుణాలు చెల్లించక పోవడంతో చాలా గ్రూపులు మూత పడ్డాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో డ్వాక్రా గ్రూపుల మహిళలకు అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా రుణ మాఫీ సాయం చెల్లించడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అధికారం చేపట్టిన తర్వాత మూడో విడత నగదును డ్వాక్రా గ్రూపుల సభ్యుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివక్షకు తావులేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించడం జరుగుతోందన్నారు. మహిళలకు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో లబ్ధి చేకూరిందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ రాము, చదలవాడ రమేష్, ఎంపీటీసీ వల్లిక రాణి, వలేటి శివాజీ, గ్రామ సర్పంచ్‌లు నాగేశ్వరరావు, కిరణ్ బాబు, మైనార్టీ నాయకుడు షేక్ హుసేన్ పాల్గొన్నారు.

పేరలి మాజీ సర్పంచ్ సుబ్బారావు మృతి



నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

కర్లపాలెం: పేరలి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ మేకల సుబ్బారావు(80) ఆదివారం ఉదయం మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన సుబ్బారావు పేరలి సర్పంచ్‌గా, పేరలి సొసైటీ చైర్మన్‌గా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ఏఎంసీ డైరెక్టర్‌గా, ఎంపీటీసీగా సేవలందించారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నేతగా కొనసాగుతున్నారు. హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే కోన రఘుపతి సుబ్బారావు మృతి వార్త తెలుసుకుని, ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, అంబేడ్కర్ యువజన సమాజం గౌరవ అధ్యక్షుడు పరమానంద కుమార్, మోపర్తి జాన్, గంటా అంజిబాబు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సుబ్బారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

'బాపట్ల'కు స్వాగతం



రేపల్లె: బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుమూడి–పులిగడ్డ బ్రిడ్జి వద్ద పెనుమూడి గ్రామంలో బాపట్ల జిల్లాకు స్వాగతం పలికే బోర్డును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ డి.మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం బోర్డు ఏర్పాటు చేసి అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడారు. జిల్లాల పునర్విభజన జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ బోర్డును ఏర్పాటు చేశామన్నారు. కృష్ణా జిల్లా నుంచి బాపట్ల జిల్లా అనుసంధానిస్తూ పెనుమూడి–పులిగడ్డ ఉండటంతో కృష్ణా జిల్లా వైపు నుంచి వచ్చే ప్రజలకు స్వాగతం పలుకుతూ బోర్డును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం



అన్నం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల: పట్టణంలో భీమావారి పాలెంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏటా శ్రీరామ నవమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ నుంచి లేళ్ళ నరేంద్రనాథ్, రౌతు రామాంజనేయులు, భీమా రాము, లేళ్ళ శ్రీను, నరసింహరావు, జిట్టా శ్రీనివాసరావు, ప్రమీలా రాణి, లేళ్ళ వెంకటప్పయ్య, విన్నకోట సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినీ రంగ అభివృద్ధికి..ఎన్టీఆర్ కృషి మరువరానిది



టీనా చౌదరి, నాగేశ్వరరావు, రమ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: సినీ రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తులలో ఎన్టీ రామారావు ఒకరని ఆళ్ళ నాగేశ్వరరావు, పరుచూరి రమ్య కొనియాడారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని పెన్షనర్ హాల్‌లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై ఆదివారం సాయంత్రం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నృత్య కళాకారిణి మన్నె టీనా చౌదరితో పాటు వక్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేములపల్లి మల్లికార్జునరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, కనపర్తి మధుకర్, పినపాటి సురేష్, బొల్లినేని జ్యోతి, గద్దిపాటి సీతారత్నం, మన్నె సత్యనారాయణ, శివకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారతీ నగర్ సొసైటీ అధ్యక్షుడు యతిరాజులు మృతి

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం ఉప్పరపాలెంలోని భారతీనగర్ సొసైటీ అధ్యక్షుడు తాడిశెట్టి యతిరాజులు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పొన్నూరు పట్టణంలోని శాంతీనగర్‌లో యతిరాజులు నివాసానికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణ రావు, బొద్దులూరి రంగారావు ఉన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

కర్లపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గ్రామ వలంటీర్లపై, గృహ సారథులపై ఉందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తుమ్మలపల్లి, పెదపులుగువారి పాలెం గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు, గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు దబ్బుకూటి ఏడుకొండలు, అక్కల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆపన్నహస్తం



బాధిత కుటుంబానికి నగదు చెక్కు అందజేత

చుండూరు(భట్టిప్రోలు): చుండూరులో ఇటీవల తాటి చెట్టుపై నుంచి ప్రమాదవ శాత్తూ కింద పడి మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి కారంకి ఫౌండేషన్, గాడ్స్ అండ్ గాడ్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆపన్న హస్తం అందించారు. మృతుడు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఆదివారం దాతల నుంచి సేకరించిన రూ.15 వేలు నగదు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు కారంకి వెంకట శివనారాయణ గౌడ్, వంగ రాములు గౌడ్, మాన్యం వెంకటనారాయణరావు, వెంకటేశ్వరరావు, సాంబ శివరావు, చుండూరు పంచాయతీ కార్యదర్శి ఇంటూరు శివరామ కృష్ణ, సర్పంచ్ ఉయ్యూరు అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె: గంగడిపాలెం పంచాయతీ జొన్నవారి పాలెం పాఠశాల మైదానంలో మోపిదేవి రాజీవ్ యువ సేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొన్నారు. తీర ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో క్రీడాకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా టోర్నమెంట్ నిర్వహణకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, గంగడిపాలెం, రాజుకాల్వ సర్పంచ్‌లు తిరుమలశెట్టి శివాజీ, తలశిల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



హయ్యర్‌నగర్‌లో పాస్టర్ డాక్టర్ ఏసురత్నం సందేశం



మట్టల ఆదివారం ర్యాలీ సందర్భంగా చిన్నారులు



ఈతమట్టలతో ప్రదర్శన నిర్వహిస్తున్న రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ



చందోలు పెద హరిజన వాడలో..



వేమూరులోని చావలి గ్రామంలో పిల్లల ర్యాలీ

బాపట్ల అర్బన్: సీబీజెడ్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ రాహుల్ దేవ్ క్రీస్తు సూక్తులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ జె.రత్నకుమార్, టి.ప్రేమ్‌చంద్, జె.క్రిష్టఫర్, జి.జాన్సన్, జీఎస్ హెర్బర్ట్, సండే స్కూల్ విద్యార్థులు, సంఘ కాపరులు, పెద్దలు, సంఘస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించే ఈస్టర్ పండుగకు ముందు వచ్చే మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు ఏసు జయం అనే నినాదంతో క్రీస్తును శిలువ వేయడానికి నిరసనగా పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతబూని వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. ఏసు క్రీస్తు మరణానికి నివాళులర్పించారు. పాస్టర్లు దైవ సందేశాన్ని అందించారు. భట్టిప్రోలు సావార్థిక లూథరన్ సంఘం–క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ఏసు జయ ప్రవేశ ఆహ్వాన ర్యాలీ నిర్వహించారు. గురు మండల అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ ఆధ్వర్యంలో చిన్నారులు ఈత మట్టలతో వీధులలో ప్రదర్శన చేశారు. వెల్లటూరు క్రీస్తు లూథరన్ దేవాలయంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, అంబేద్కర్ యూత్, సండే స్కూల్ విద్యార్థులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. యాజలి, బిడారు దిబ్బ, బుద్దాం, కర్లపాలెం, దాస్‌నగర్, చింతాయపాలెం, గణపవరం, కట్టావాద, పేరలి పాడు, పేరలి, నల్లమోతువారి పాలెం, పెదమర్పువారి పాలెం, నర్రావారి పాలెం, గ్రామాలలో క్రైస్తవ చిన్నారులు ఈత మట్టలను వివిధ పూలతో అందంగా అలంకరించి, క్రైస్తవ భక్తి గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శాంతి ర్యాలీ..

పిట్టలవానిపాలెం: మండలంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరులు ఈత మట్టలను పూలతో అలంకరించి, భక్తి గీతాలను ఆలపిస్తూ వాడవాడలా శాంతి ర్యాలీలు నిర్వహించారు. ప్రత్యేక ఆరాధన చేపట్టారు. చిన్నారులకు సంఘ కాపరి మట్టల ఆదివారం విశిష్టత గురించి వాక్యోపదేశం చేశారు. ఏసు ప్రభువు యెరూషలేము పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినప్పుడు అక్కడి ప్రజలు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ పెద్ద ఎత్తున వివిధ రకాల మట్టలతో (చెట్ల కొమ్మలతో)ఘన స్వాగతం పలికారు. దీనినే క్రైస్తవ విశ్వాసులు మట్టల పండుగగా ఆచరిస్తారని తెలిపారు.

హయ్యర్ నగర్‌లో వైభవంగా..

బాపట్ల: బాపట్ల పట్టణంలోని హయ్యర్ నగర్‌లో ఫాదర్ మెమోరియల్ లూథరన్ దేవాలయంలో వైభవంగా మట్టల ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి చింతా ఏసురత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతా రాధారత్నం, పెరికల రూత్ జైశీల్ బాబు, జోగి ఆది నారాయణ, రాజా, అడే చందు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సాహిత్యం దోహదం

'కవి మిత్రుల కలయిక'లో వక్తలు



కావూరి సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

పాత గుంటూరు: సాహిత్యం సమాజాభివృద్ధికి, దేశ పురోగతికే కాకుండా సమాజంలో పలు రుగ్మతల్ని రూపుమాపుతుందని ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ అన్నారు. బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ హాలులో ఆదివారం ఉదయం నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'కవి మిత్రుల కలయిక'లో భాగంగా కవి సమ్మేళనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. సభకు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలు మరే ఇతర భాషలో లేవని తెలిపారు. సమాజంలో కవికి, రచయితకు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ అజరామరమేనని చెప్పారు. అనంతరం కవి సమ్మేళనంలో ఉత్తమ కవిత చదివిన రేపల్లె రాజకృష్ణను, అతిథి కావూరి సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, కవి జానీబాషా, పింగళి భాగ్యలక్ష్మి, బండారు సురేష్ బాబు, సుభాష్ చంద్రబోస్, లెనిన్ శ్రీనివాస్, బి.సత్యనారాయణ, బి. జనార్ధనరెడ్డి, మన్నవ వెంకట గురువు, కె. విజయ్ కుమార్, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బండికల్లు జమదగ్ని పర్యవేక్షించారు.

నేడు డీఎస్సీ ప్రకటన కోరుతూ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డీఈఓ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, అభ్యర్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు సంఘ కాపరుల సమావేశం

వీర్లపాలెం(తాడేపల్లి రూరల్): దుగ్గిరాలోని వీర్లపాలెం ఏసు నామ క్షేత్రంలో ముఖ్య సంఘ కాపరుల ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.